ప్రజాశక్తి
బుధవారం 28 డిసెంబర్ 2022
5
శ్రీ సత్యసాయి

సాగుదారులకు అన్యాయం

◆రొద్దం తహశీల్దార్‌పై చర్యలు తీసుకోండి ◆పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యకాసం ధర్నా

సాగుదారులతో కలిసి పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

రొద్దం మండలంలో నిరుపేద సాగురైతులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నిరుపేద సాగుదారులపై రొద్దం మండల తహశీల్దార్ వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ దశాబ్దల తరబడి రొద్దం మండలం కోగిర గ్రామంలో 666 నుంచి 669 సర్వే నంబర్ వరకు దాదాపు 200 మంది భూమిలేని నిరుపేద దళిత, గిరిజన, బలహీన వర్గాల పేద రైతులు భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఈ భూములకు పట్టాలు ఇవ్వాలని సాగుదారులు అనేక ఏళ్లుగా అధికారులను కోరుతున్నారని చెప్పారు. దీనిపై ప్రస్తుత రొద్దం తహశీల్దార్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. సాగుదారులకు అన్యాయం చేసేలా ఆయన వైఖరి ఉందన్నారు. గత తహశీల్దార్ నివేదికలు, సబ్ కలెక్టర్ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా వ్యక్తిగత నిర్ణయాలతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా వెబ్‌ల్యాండ్ రికార్డుల మేరకు సాగుదారులు లేరని, అసలు ప్రభుత్వ భూమే లేదని తప్పుడు నివేదికలు ఇస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాడని తెలిపారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తహశీల్దార్ దళితులు, గిరిజనుల పట్ల చిన్నచూపు చూపిస్తున్నారన్నారు. పేదలకు అన్యాయం చేస్తూ అధికార పార్టీ నాయకులు, భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న తహశీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుని, పేదలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ సాగుదారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేయిస్తామని తెలిపారు. తాను కూడా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానని తెలిపారు. అర్హులైన సాగుదారులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, నారాయణ, సాగుదారులు నరసింహమూర్తి, సుబ్రహ్మణ్యం, కిష్టప్ప, మారుతి, నాగార్జున పాల్గొన్నారు.

సమస్యను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న వ్యకాసం నాయకులు

'ఆరోగ్య అనంత'కు పురిటి కష్టాలు..!

◆ఫిర్యాదులోనూ సమస్యలు
◆ఇంకా తొలగని సాంకేతిక ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం చొరవతో చేపట్టిన 'ఆరోగ్య అనంతపురము' యాప్‌కు పురిటి కష్టాలు తప్పడం లేదు. ఇంకా పూర్తి స్థాయిలో సాంకేతిక సమస్యలు తొలగలేదు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టరు కేతన్ గార్గ్ సంయుక్త ఆలోచన రూపం ఆరోగ్య అనంతపురము. దీన్ని సోమవారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. 12 ప్రభుత్వ విభాగాల్లోని సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు అధికారులు, కార్యాలయాల వద్దకు రాకుండానే నేరుగా ఆన్‌లైన్‌లో ఆయా విభాగాధిపతుల దృష్టికి సమస్య తీసుకెళ్లేందుకు వీలుగా 'ఆరోగ్య అనంతపురము'పేరుతో ఒక యాప్‌ను రూపొందించారు. ఇది ప్రారంభమైన రోజే కొంత మంది దీని పనితీరును పరిశీలించే ప్రయత్నం చేశారు. అయితే సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ సమస్యలేమైనా ఉంటే తెలియజేసేందుకు వీలుగా ఒక నంబరునూ అందులో ఉంచారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే తన నంబరు అందులో ఉందా అని ఆశ్చర్యం వ్యక్తం చేయడం గమనార్హం. తనకు ఆ బాధ్యతలు అప్పగించినట్టు కూడా తెలియదని చెప్పారు. ఇదేమిటని అడిగిన వ్యక్తే నివ్వెరపోయే పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆన్‌డ్రాయిడ్ ఫోన్ వరకు ఇది పనిచేస్తున్నప్పటికీ ఆపిల్ వంటి మొబైల్ ఫోన్లలో ఇది ఇంకా పనిచేసే పరిస్థితి లేదు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగలిగేది విద్యావంతులే ఉంటారు. విద్యావంతులు చాలా వరకు ఇప్పుడు సాంకేతిక బాగావున్న మొబైల్ ఫోన్స్‌నే వాడుతుంటారు. అటువంటి వారు వీటికి ఇప్పుడు ఫిర్యాదు చేయడానికి వీల్లేకుండా ఉంది.

యాప్ లక్ష్యం ఉన్నతం

జిల్లా ఉన్నతాధికారులు ఒక మంచి లక్ష్యంతోనే ఈ యాప్‌ను రూపొందించారు. ప్రజలందరూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా సమస్యను నేరుగా సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌లోనే ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా రూపొందించారు. లాగిన్ కావడం తమ సమస్యను యాప్‌లోనే తీసుకెళ్లవచ్చు. దీన్ని నిర్ణీత సమయంలో పరిష్కరించే విధంగా ఆపై ఉన్నతాధికారుల సమీక్షలు ఉండనున్నాయి. దీంతో సోమవారం మాత్రమే స్పందన కార్యక్రమానికి వచ్చి ఇవ్వాలన్నది ఏమీ ఉండదు. ఈ మేరకు కొంత వరకైనా స్పందనలో ఒత్తిడి తగ్గే అవకాశముంటుంది. వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, సివిల్ సప్లైయిస్, డిఆర్‌డిఎ, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, విద్య, ఆరోగ్యం, ఉద్యానవన శాఖ, ఐసిడిఎస్, కమర్షియల్ ట్యాక్సు, తూనికలు కొలతల శాఖలు మొత్తం 12 విభాగాలను సంబంధించిన ఫిర్యాదులను, సమస్యలను తెలియజేసేందుకు వీలుగా యాప్‌ను రూపొందించారు. ఇది కేవలం జిల్లా స్థాయి సమస్యలు మాత్రమే విన్నవించుకునే వీలుంటుంది. ఇది సక్సెస్ అయితే మరింత విస్తరించే అవకాశాలూ ఉండనున్నాయి. ప్రారంభంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు కొంత ఇబ్బందికరంగా మారాయి. వీటిని పరిష్కరించగలిగితే ప్రజలకు మరంత మెరుగైన సేవలందే అవకాశాలున్నాయి.

మార్కెట్ సముదాయాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

వాణిజ్యసముదాయంలో అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం..

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య భవన సముదాయంలో పూల వ్యాపారస్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఇన్‌చార్జి కమిషనర్ హరిబాబు తెలిపారు. నూతన వాణిజ్య సమూదాయం ప్రారంభించినప్పటికి పూల వ్యాపారాలు పశువర్ధక శాఖ కార్యాలయ ఆవరణంలో జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తకు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ స్పందించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య భవన సముదాయాన్ని ఈసందర్భంగా వారు పరిశీలించారు. పూల వ్యాపారులు తమకు కేటాయించిన స్థలంలో కనీస సౌకర్యాలు లేక పోవడంతోనే ఇప్పటి వరకు మార్కెట్‌లో లావాదేవీలు జరపడం లేదని చెబుతుండటంపై వివరణ ఇచ్చారు. నిబంధనల మేరకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని వారికి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్ జబివుల్లా, ఎసిపి ఆనంద్‌బాబు, రెవిన్యూ అధికారి రంగరావు, ఆర్ఐలు రామాంజి, రాము ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సత్యసాయి జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ ఇంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో సబ్ జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపిక జరిగింది. ఈ ఎంపికనుహాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బంధనాధం సూర్యప్రకాష్; సీనియర్ క్రీడాకారులు చంద్రశేఖర్, అరవింద నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28వ తేదీనుండి 31వ తేదీవరకు వైజాగ్లో నిర్వహించే సబ్ జూనియర్ పోటీలో పాల్గొంటారన్నారు. జట్టు సభ్యులుగా నవీన్, మహబూబ్‌బాషా, పవన్‌కుమార్, దుర్గాప్రసాద్, అఖిల్‌కుమార్‌రెడ్డి, అభిషేక్, సాలు, జనంద, రవి, వెంకటరెడ్డి, వంశీ, మహమ్మద్ ఆర్పిన్ శురేష్, భరధ్వాజ్, మనోజ్, సంతోష్ ఆనంద్, శశాంక్, లోకేశ్ ఎంపికయ్యారని చెప్పారు. జట్టు మేనేజర్ అరవిందగౌడ్, కోచ్‌గా సాయి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జట్టు సభ్యులు వైజాగ్‌లో నిర్వహించే సబ్‌జూనియర్ హాకీ పోటీల్లో ప్రతిభ కనపర్చి ధర్మవరానికి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను వారు అభినందించారు.

జిల్లా సబ్‌జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికైన ధర్మవరం క్రీడాకారులు

లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

అర్హులకు పథకాల లబ్ధి

◆కలెక్టర్ బసంత్‌కుమార్
◆నవరత్నాలు ద్వైవార్షిక నగదు అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూరుస్తున్నట్లు ఎంపీ గోరంట్ల మాధవ్, కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నవరత్నాలు- ద్వైవార్షిక నగదు బదిలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ద్వైవార్షిక నగదు 11.84 కోట్లను 7422 మంది ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. పొరపాటున ఏ కారణం చేతనైన లబ్ధి పొందని అర్హులైన వారికి ద్వైవార్షిక పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 11.84 కోట్లతో 7422 మందికి ప్రస్తుతం లబ్ధి చేకూరిందన్నారు. పంటల బీమా 2021కి సంబంధించి 2154 మందికి రూ.10.70 కోట్లు మంజూరు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఒక్కళిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఆవుటాల రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, ఎంపీపీ రమణారెడ్డి, చేనేత జౌళిశాఖ ఏడి రమేష్, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, మాజీ ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ పామిడి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థులు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సియా, కరస్పాండెంట్ సిస్టర్ అనమ్మాథ్యూస్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈనెల 28 నుంచి జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు విద్యార్థులు శశాంక్, మొహమ్మద్‌అశ్వక్, అభిషేక్, శబరీష్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా వారు అభినందించారు.

ఎస్పీకి ప్రయివేటు పాఠశాలల సంఘం ఫిర్యాదు

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి డివిజన్‌లోని ప్రవేట్ పాఠశాలల యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఆర్‌ఎస్‌వైఎఫ్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ నాయకులు ఎస్పీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. రాయలసీమ విద్యార్థి యువజన ఫెడరేషన్ అనే సంఘం పేరుతో కొందరు స్వార్థపరులు కదిరి డివిజన్ లో వున్న ప్రవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లపై బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. చందాలు ఇవ్వాలని లేకుంటే మీ స్కూల్‌లో వసతులు సరిగా లేవని పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని కొన్ని నెలలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా తమను కులం పేరుతో దూషించారని కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. చిన్న చిన్న విద్యాసంస్థలు స్థాపించి తమతో పాటు కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ విద్యాభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందిస్తున్న తమపై బెదిరింపులకు దిగడం ఎంతవరకు సమంసజమని అన్నారు. వీరి ఆగడాలు ఇలాగే కొనసాగితే తాము స్కూళ్లను మూసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సిఆర్‌ఒ రవిచంద్రారెడ్డి , అనంతపురం నగర గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లేష్, కదిరి డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, శేషానందరెడ్డి, సాదిక్ బాషా, శంకర్ రెడ్డితో పాటు ఆయా ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి: సిఐటియు

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి -పెనుకొండ

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ట్రాన్స్‌పోర్ట్‌రంగ 2వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా మహాసభలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఆర్థికవిధానాల వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలన్నారు. 15సంవత్సరాలు దాటిన వాహనాలకు ఫిట్నెస్ పేరుతో వసూలు చేస్తున్న రూ 4వేల చలానా వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పోర్టు రంగాన్ని ఆదుకోవడంలో విఫలం చెందాయన్నారు. ఆటోల కొనుగోలుకు బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేసి, ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ ద్వారా లోన్లు మంజూరు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవరుకు వాహన మిత్ర పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేసే కార్మికులందరు సంఘటితమై ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ఆటో యూనియన్ జిల్లా రాష్ట్ర కమిటీ సభ్యులు రఫీ, రామకృష్ణ , సిఐటియు మండల కార్యదర్శి బాబావల్లి, జిల్లా అధ్యక్షులు గౌస్ లాజం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా, జిల్లా కోశాధికారి ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కుల్లాయప్ప, రంగన్న, సహాయ కార్యదర్శి రఫీ ,అయాజ్ ,రామ్మోహన్, 27 మంది జిల్లా కమిటీ సభ్యులతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రవీణ్ కుమార్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ సమీపంలో దారుణం..

ప్రజాశక్తి - పెనుకొండ

భార్యపై అనుమానంతో పసికందు అని కూడా చూడకుండా కన్నబిడ్డను దారుణంగా హతమార్చాడో తండ్రి. ఈ ఘటన పెనుకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పెనుకొండ ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాలు... మడకశిర మండలానికి చెందిన గంగరాజు తన భార్య గౌరీ అలియాస్ కవితతో గొడవపడి తన కుమారుడు వికాస్ ను తల్లి నుండి తీసుకొని రంగేపల్లి దగ్గర వున్న పెనుకొండ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి చంపేశాడు. వారం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు పెనుకొండ పరిధిలోని అటవీ ప్రాంతంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సుంది.

బాలుడి మృతదేహం

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించండి

కొత్తచెరువు : విద్యార్థులకు మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర బాలికల పాఠశాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం రుచికరంగా అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నాడు నేడు కింద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు చెన్నకృష్ణారెడ్డి, సుమన, జెడ్పీటీసీ గంగాదేవి శంకర్, విద్యా కమిటీ చైర్మన్ గిరిబాబు, వైసిపి నాయకులు రామచంద్ర, ముద్దల భాస్కర్, సుబ్బారావు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సమస్యల పరిష్కారానికే 'గుడ్ మార్నింగ్'

ముదిగుబ్బ : ప్రజాసమస్యల పరిష్కారానికే గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చెప్పారు. మండల కేంద్రంలోని వడ్డే పేట కాలనీలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఇందుకూరు నారాయణరెడ్డి, జెడ్పీటీసీ తిరుమల బాయ్ సేవే నాయక్, సర్పంచి చిన్న రాయుడు, లక్ష్మీదేవితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే

ఎస్‌ఆర్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలకు చికిత్స కోసం వచ్చే గర్భిణులకు ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, తెలుగుదేశంపార్టీ రాష్ట్రకార్యనిర్వహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ డైరెక్టర్ క్రిష్టప్ప, తిరుపాల్ నాయుడు, లింగప్ప, సిద్దన్న, వైద్యాధికారి జగదీష్, అక్బర్, బాబు, పెద్దిపల్లి రాము, గోబ్బరంపల్లి రవి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంటలో పంటకోత ప్రయోగాలను అధికారులు మంగళవారం నిర్వహించారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో మల్లయ్య పొలంలో పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, ఎఎస్ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, వివిఎ నిఖితకుమారి. ఎస్బీఐ ఇన్సూరెన్స్ అధికారులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమకేసులు, భూకబ్జాలపై చర్చించిన 'చిలకం'

ధర్మవరం టౌన్ : విజయవాడలోని ఐలాపురంలో స్టేట్ స్పాన్సర్ టెర్రరిజం సేవ్ డెమొక్రసీ అఖిలపక్షం సమావేశంలో వైసీపీ అవలంబిస్తున్న భూకబ్జాలు, అక్రమకేసులు, దాడుల గురించి చర్చించినట్లు జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ముఖ్యనాయకులతో కలిసి రాష్ట్రంలోనిమంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు తదితర వాటిపై చర్చించామన్నారు భవిష్యత్తులో వైసీపీ అరాచకాలు, అక్రమాలపై ఎలా ఎదుర్కోవాలో చర్చించామని చెప్పారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

నంబులపూలకుంట : మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : మండల రిసోర్స్ సెంటర్ నందు ఎంఇఒ జాన్ రెడ్డప్ప ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమణ, చెన్నకేశవ కుమార్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని కెజిబివిలో గల 8వ తరగతి విద్యార్థినులకు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బాబయ్య ఉరుసు

పెనుకొండ : బాబయ్య ఉరుసు ప్రశాంతంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తిక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ ఛాంబర్ లో సబ్ కలెక్టర్ నేతృత్వంలో డిఎస్పీ హుస్సేన్ పీరా, తహశీల్దార్ స్వర్ణలత,నగర పంచాయతీ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్, వక్ఫ్ బోర్డ్ ఇన్స్‌పెక్టర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్, సిఐ. వెంకటేశ్వర్లు, ఎస్ ఐ రమేష్ బాబు, దర్గా వంశ పారంపర్య పీఠాధిపతి తాజ్ బాబా కుమారుడు సలావుద్దీన్ బాబా, ఆల్ కౌసర్ సంస్థ అధ్యక్షులు అహమ్మద్ హుస్సేన్, బాబయ్య స్వామి వంశీయులు నూర్ బాబా, ముస్లిం పెద్దలు తదితరులతో సమావేశం నిర్వహించారు.కలెక్టర్ కు నివేదికలను పంపి ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంతవరకు టెండర్లు నిలిపివేస్తున్నామని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

పుట్టపర్తి అర్బన్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు నాగరాజు నాయక్ సూచించారు. మంగళవారం మండలంలో ఇరుగరాజు పల్లి లో వైద్య సిబ్బందితో కలసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీటి నిలువలు లేకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు, విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ నగేష్, సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్ విజయ్ భాస్కర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లేపాక్షి : కరోనా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి చిరంజీవి సూచించారు. కరోనా నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హుసేన్ బీ, సుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, ఎఎన్‌ఎం ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఓబుల దేవర చెరువు : నిబంధనల పేరుతో మండల వ్యాప్తంగా పెద్దసంఖ్యలో పింఛన్లు తొలగించడానికి పూనుకున్నారని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆపార్టీ పుట్టపర్తి నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, కిష్టప్ప, కృష్ణారెడ్డి, దేవేంద్ర, రత్న బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ఆయకట్టుకు నీరు విడుదల

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం, పట్నం శ్రీ రంగనాయకుని చెరువు క్రింద గల 500 ఎకరాల ఆయకట్టుకు కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి మంగలవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి నియోజకవర్గంలోనే అతిపెద్ద చెరువైన శ్రీ రంగనాయకులు పట్నం చెరువు నుంచి సాగుకి నీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 2019 నుంచి వరుసగా నాలుగు సంవత్సరాలుగా చెరువును నీటితో నింపి మరువ పారించామన్నారు. వేసవిలో ఒక మూడు నెలలు తప్ప మిగిలిన 9 నెలలపాటు ఈ చెరువులోకి శాశ్వతంగా నీరు ఉంటుందన్నారు. ఆయకట్టు కింద ఉన్న రైతులు పంటలు సాగు చేసుకోవాలని కోరారు. రాజకీయాలను పక్కనపెట్టి కలిసికట్టుగా వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. కాలువలు పూడుకుపోవడంతో సాగు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో మరమ్మతుల నిమిత్తం తన వంతుగా లక్ష రూపాయలు ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, ఇరిగేషన్ డిఇ, జెఇ తోపాటు మండల కన్వీనర్ ప్రకాష్, జిల్లా అగ్రి బోర్డ్ మెంబర్ సుధీర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద నాయక్, సర్పంచి చలపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

ధర్మవరం టౌన్ : వైద్యులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని డిఎం హెచ్‌ఒ కృష్ణారెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని తనిఖీచేశారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ప్రధానంగా ఆక్సిజన్ ప్లాంటును పరిశీలించి వాటి పనితీరును అడిగితెలుసుకున్నారు. కరోనా ప్రబలుతున్న నేపథ్యంలో ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలుతీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మలతకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌ఒ సెల్విసల్మాన్, వైద్యులు వెంకటేశ్వర్లు, శ్రావణి, నాగప్రసాద్, ఇందురేఖ, సూపర్వైజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి : స్థానిక ప్రభుత్వ వైద్య శాలను డిఎంహెచ్‌ఒ ఎస్వీ కృష్ణారెడ్డి మంగళశారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సెల్వియా సాల్మన్, డాక్టర్ జ్యోతిర్మాయ్, సిహెచ్‌ఒ హేమలత దేవి, ఎంపిహెచ్ఇఒ నారాయణస్వామి, మనోహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐసియులో పరికరాలను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై మౌనం వీడండి : టిడిపి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రభుత్వ స్థలాల అక్రమణపై అధికారులు మౌనం వీడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ కోరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక 3వేలు పింఛన్ ఇస్తామంటూ గద్దెనెక్కిన జగన్ ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. చివరకు ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకున్న వారి పింఛన్లు కూడా తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై తాము ఎక్కడైనా నిలదీస్తే అధికారులు తప్పు చేసి ఉంటారని వైసీపీ సాకులు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా దోపీడీ సిఎం జగన్ దగ్గరనుంచే ప్రారంభమైందనిఆరోపించారు. మున్సిపాలిటీలో నిషేదిత జాబితాలో ఉన్నస్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని అన్నారు. ఆక్రమణలు, అక్రమాలపై భవిష్యత్తులో కచ్చితంగా విచారణ జరుగుతుందని, ఆ రోజు ఎవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, పణికుమార్, వేణుగోపాల్ రెడ్డి, మహేష్ చౌదరి, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాదనాయుడు, నాగూర్ హుస్సేన్ , రాంపురంశీన, రాళ్లపల్లి షరీఫ్, పఠాన్ బాబూఖాన్, కేశగాళ్లశీన, గోపలశ్రీరాములు, కేతినేని రాజు, కొత్త పేటఆది, చిన్నూరు విజయ్ చౌదరి, తొగట అనిల్, తోటవాసుదేవ తదితరులు పాల్గొన్నారు .

క్రీడాకారులను అభినందిస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

ఫైనల్‌కు చేరిన ధర్మవరం జట్టు

ధర్మవరం టౌన్ : ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంత ప్రీమియర్ లీగ్‌లో ధర్మవరం అండర్-15 క్రికెట్ జట్టుకు ఫైనల్‌కు చేరుకున్నట్లు క్రికెట్ అసోసియేషన్ నాయకులు వడ్డెబాలాజీ తెలిపారు. ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న అనంతప్రీమియర్ లీగ్ లో అనంతజట్టుతో పోటీపడిన ధర్మవరం జట్టు విజయం సాధింఇచ ఫైనల్‌కు చేరుకుందన్నారు. ఈనెల 30 న జరిగే ఫైనల్ పోటీల్లో ధర్మవరం జట్టు పాల్గొంటుందన్నారు. దీంతో జట్టు సభ్యులను అసోషియేషన్ సభ్యులు మంగళవారం స్థానిక గుట్టకిందపల్లి ఆర్డీటీ క్రీడామైదానంలో అభినందించారు.

భూసేకరణను వేగవంతం చేయండి

ముదిగుబ్బ : మండలంలోని మలక వేమల, సానే వారి పల్లి గ్రామాలకు సంబంధించిన రైతులకు చెందిన భూముల సేకరణను వేగవంతం చేయాలని ధర్మవరం ఆర్డీవో తిప్పేనాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని మలక వేమన క్రాస్ లోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద నిర్వాసిత రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు విస్తరణలో భాగంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు 53 మంది రైతుల భూములను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు సంబందిత రైతులు తమ ఆధార్ కార్డు ఇస్తే వారికి సంబంధించిన నష్టపరిహారాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగేంద్ర, ఎస్ఐ లక్ష్మీనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

నేడు కార్మిక చైతన్యయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన కార్మిక చైతన్య యాత్ర హిందూపురం నుంచి బుధవారం ప్రారంభం అవుతున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు సిఐటియు రాష్ట్ర మహాసభలు జనవరి 1 నుంచి భీమవరంలో జరుగుతాయన్నారు. రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని హిందూపురం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రను ఉదయం 9గంటలకు రాష్ట్ర కార్యదర్శి గఫూర్, రాష్ట్ర నాయకులు ఆర్‌వి నరసింహారావు, స్వరూపరాణి ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి బెంగళూరు రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ చేరుకుని, అక్కడ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియుతో అనుబంద సంఘ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ఓబుల దేవర చెరువు : స్థానిక వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గత 5 సంవత్సరాలుగా సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మనోహర (40) గుండెపోటుతో మృతిచెందాడని ఆ పాఠశాల కరస్పాండెంట్ శివ శంకర్ రెడ్డి. హెచ్‌ఎం జయసింహారెడ్డి తెలిపారు. ఉదయం తన గ్రామమైన పట్నంలో గుండెపోటు రాగా అక్కడి నుంచి కదిరి తీసుకున్న వెళ్లే లోపు మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు.ఉపాధ్యాయులు హరి, అశోక్, ప్రసాద్, మూర్తి ,మోహన్ రెడ్డి, ప్రసాద్, జన తదితరులు మనోహర్ మృతికి సంతాపం తెలిపారు.

ఇళ్ల పట్టాల అవినీతిపై విచారణ

కొత్తచెరువు : కొత్తచెరువులోని వేణుగోపాలస్వామి మన్యం భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంలో జరిగిన అవినీతి అక్రమాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు 15 బృందాలుగా అక్కడికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఎంత మంది ఇల్లు నిర్మించుకున్నారు. ఎన్ని ఖాళీ ఉన్నాయి, ఎన్ని అమ్ముకున్నారో గుర్తించారు. వీటిపై నివేదికలు రెండు రోజుల్లో పూర్తి చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి తెలిపారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ

చిలమత్తూరు : మండల పరిధిలోని దేమకేతేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 6,7,8 తరగతులు చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో సైకిళ్లను మంగళవారం పంపిణీ చేశారు.గొళ్లపల్లి, తమ్మినాయనపల్లి, ఓబుళాపురం, కొర్లకుంట, సోమిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 73 మంది విద్యార్థినులకు ఎస్ఐ శ్రీనివాసులు చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, వన్నూరు స్వామి, మహేష్, హెచ్‌ఎం శేషాచలం, ఎంపీటీసి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా భూముల వేలం అవాస్తవం

పెనుకొండ : పట్టణంలోనిబాబయ్య స్వామి దర్గా భూములను వేలం వేయలేదని, ప్రభుత్వానికి సంబంధించిన భూములలో ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్, పార్కింగ్ స్థలాలను ఉరుసు సందర్భంగా 30రోజులకు మాత్రమే టెండర్లకు మాత్రమే ప్రకటన ఇచ్చామని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ దర్గాకు వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు వేలం వేయలేదని చెప్పారు.ఉత్తర భాగాన వున్న ప్రభుత్వానికి చెందిన భూమిలో టెండర్లు పిలుస్తున్నామని చెప్పారు. టెండర్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని నగర పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు.

టిడిపి నాయకులపై దాడులు తగదు

కొత్తచెరువు : రాష్ట్రంలో టిడిపి నాయకులపై వైసీపీ నాయకులు దాడులు చేయడం తగదని మాజీ సర్పంచయి మాణిక్యం బాబా, మండల మైనార్టీ అధ్యక్షులు సైకిల్‌షాప్ బాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో మైనార్టీ నాయకుడు షేక్ ఇబ్రహీంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దౌర్జన్యాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. బుకపట్నం దగ్గర అంబులెన్స్ రమేష్ పై పేదరాశి సుబ్రహ్మణ్యం అనుచరులు దాడులు చేయడం తగదని ఈ దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో మైనార్టీ నియోజకవర్గం ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సుహేల్, మైనార్టీ నాయకులు షబ్బీర్, అల్లా బకాష్, నబి నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

బాబయ్య దర్గాను అభివృద్ధి చేయండి

పెనుకొండ : బాబయ్య దర్గాను అభివృద్ధి చేయాలని వైసిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు నూర్‌బాబా కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కె. కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నూర్ బాబా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దర్గా అభివృద్ధికి నాలుగు కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని ఈ నిధులతో దర్గా వద్ద భక్తులకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని కోరారు.

పేదల కడుపుకొడుతున్న ప్రభుత్వం : టిడిపి

పెనుకొండ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం లక్షలాది మంది పింఛన్లు అన్యాయంగా తొలగిస్తూ పేదల కడుపుకొడుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. మంగళవారం పెనుకొండ పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సవితమ్మ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 3వేల రూపాయలు పింఛను ఇస్తామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి మాట మార్చి మడమ తిప్పాడని విమర్శించారు. వివిధ రకాల సాకులతో సచివాలయ అధికారులచే నోటీసులు ఇస్తూ పింఛన్లు తొలగించడానికి కుట్ర పన్నారని అన్నారు. పెనుకొండ నగర పంచాయతీలో పరిదిలోని ఇందిరమ్మ ఇంటిలో నివసిస్తున్న నిరుపేదకు 158 ఇళ్లుఉన్నాయంటూ పింఛన్ నిలిపివేత నోటీసు అందజేశారని అలాగే ఇస్లాపురం గ్రామానికి చెందిన రజక రామక్క అనే వితంతువుకు 158 ఇళ్లు ఉన్నాయని, అవన్నీ 1,30,649 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయని పింఛన్ నిలిపివేస్తున్నట్టు సచివాలయ ఉద్యోగులు నోటీసు అందించారని చెప్పారు. అర్హులకు పింఛన్లు ఇచ్చే వరకు పోరాడుతామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గుట్టూరు సూర్యనారాయణ, శ్రీరాములు, త్రివేంద్ర నాయుడు, కౌన్సిలర్ గీతా హనుమంతు, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

పుట్టపర్తి, మడకశిరలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు పల్లె రఘునాథరెడ్డి, ఈరన్న, తదితరులు

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో దౌర్జన్యాలు దాడులు చేస్తూ వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని నిడిమామిడి పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లెతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఈ అరాచక దౌర్జన్య పాలనకు ప్రజలు చమర గీతం పాడటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ విజయ్ కుమార్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మడకశిర : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈరన్న విమర్శించారు. మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల కాలంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అన్నారు. .ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాండురంగప్ప, రవిభూషన్, ఆదినారాయణ, అశ్వర్థామప్ప,ఉగ్ర నరసింహ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని మద్దిమడుగు, పంతుల చెరువు, తవలంమర్రి గ్రామాలలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, నాయకులు లక్ష్మీపతి నాయుడు, మాబుసాబ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ అంజనప్ప, సీనియర్ నాయకులు నాగభూషణ నాయుడు, అశ్వర్థ నాయుడు, లక్ష్మీనారాయణ, పూరాతి గంగాధర్, తిరుపాలు, నాగబయప్ప తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : రైతుల బతుకులు మారాలంటే వైసీపీని గద్దె దింపాల్సిందే అని మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి అన్నారు. మండలపరిధిలో తడంగిపల్లి, మోపాలపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో అయన తో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సత్యసాయి జిల్లా మహిళా అధ్యక్షురాలు లీలావతి, సుబ్బరత్నమ్మ, నరసింహులు, చిన్నప్పయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : రాష్ట్రంలో గతంలోని టిడిపి పాలన ఎలాఉందో, ప్రస్తుత వైసీపీ పాలన ఎలాగుందో ప్రజలే నిర్ణయించుకోవాలని మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత పర్యటనలో వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. వైసీపీ మండల కన్వీనర్ గా ఉన్న అమర్ నాథ్ రెడ్డి పుట్టినరోజు వచ్చే నెల 8వ తేదీ ఉంటే.. ఇవాళ సునీత పర్యటన నేపథ్యంలో ఎక్కడ చూసిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయన ఫ్లెక్సీలకు ఎలాంటి ఇబ్బంది రాకూడదని పోలీసులు కాపలాగా కనిపించారు. మామిళ్లపల్లి సెంటర్లో ఇద్దరు ఎస్ఐలు, 20 మంది పోలీసులు కాపలాగా ఉండడం అందర్నీ ఆశ్చరానికి గురి చేసింది. మండలంలో జరుగుతున్న పరిణామాలపై పరిటాల సునీత తీవ్రంగా స్పందించారు. తాను గ్రామంలో పర్యటిస్తుంటే ప్రజలు ఎవరూ బయటకు రావద్దని.. సమస్యలు చెప్పవద్దని వాలెంటీర్ల ద్వారా బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఏక పక్షంగా వ్యవహరించి తమ వాళ్లను ఇబ్బంది పెడితే స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలకన్వీనర్ యాతం పోతలయ్య, జిల్లాఉపాధ్యక్షులు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, ముకుందనాయుడు, గంగిరెడ్డి, ప్రధానకార్యదర్శి నరేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, తెలుగుయువత బట్టా సురేష్ చౌదరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

కదిరి టౌన్ : కదిరిలో కబ్జాలు పెరిగిపోయాయని టిడిపి పట్టణం అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ ఆరోపించారు. రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం టిడిపి నాయకులు ఇనాయత్ ఆధ్వర్యంలో మంగళవారం కదిరిలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి బాషా, బాబావలి, కతాబలి ఖాన్, పర్వీన్ భాను, ఖాదర్‌బాషా, జిలాన్‌ఖాన్, సులేమాన్ , హైదర్, జావీద్, రోషన్, శంవాజ్, బావాజాన్, ప్రేమలత ఉమాదేవి గంగ రత్నమ్మ, శారద ఆయేషా, తదితరులు పాల్గొన్నారు.